క్లుప్తంగా

ముక్కంటి సేవలో ప్రముఖులు


గురు దక్షిణామూర్తి సన్నిధిలో ఎమ్మెల్యే కొడాలి నాని


ఆలయంలో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. కేంద్ర మంత్రి బీఎల్ వర్మ, మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈవో సాగర్‌బాబు, పాలకమండలి సభ్యుడు జయశ్యామ్ స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించి, స్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో మంగళవారం ముందస్తుగా శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో చిన్నారులు బాలకృష్ణులుగా అలరించారు. ప్రిన్సిపల్ రూపాదేవి మాట్లాడుతూ శ్రీకృష్ణుడు భగవద్గీతను బోధించి సమస్త మానవాళికి దిశా నిర్దేశం చేశారని తెలిపారు. అనంతరం చిన్నారుల సంస్కృతిక ప్రదర్శనలు రంజింపజేశాయి. ఏజీఎం సురేష్, ఉపాధ్యాయులు, డీన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా డాక్టర్ కిషోర్స్ రత్నం పాఠశాలలో కూడా శ్రీకృష్ణా జన్మాష్టమి వేడుకలు జరిగాయి. ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, మేనేజరు ఆచారి, డైరెక్టర్లు కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీకి రాజీనామా

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ సభ్యురాలు, మాజీ కౌన్సిలర్ ప్రమీలమ్మ తెలుగుదేశం పార్టీకి మంగళవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆమె నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్‌కు రాజీనామా లేఖను పంపారు. వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు. కాగా ఇటీవల టీడీపీలో జరుగుతున్న పరిణామాలతో ఆమె మనస్తాపానికి గురై రాజీనామా చేసినట్లు పలువురు అంటున్నారు.

పెంచిన పెట్రోలు ధరలు తగ్గించాలి

ఏర్పేడు: కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజల్ ధరలు తగ్గించాలని సీపీఎం నాయకులు మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. పెంచిన ధరతో సామాన్యుడు ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. సీపీఎం మండల కార్యదర్శి కరీముల్లా, రైతు సంఘం జిల్లా నాయకుడు రంగయ్య, కేవీపీఎస్ మండల నాయకుడు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రూ. 29 వేలు రికవరీకి ఆదేశాలు


మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

సత్యవేడు: మండల పరిధిలో జరిగిన ఉపాధి పనులు 904, అందజేసిన నగదు రూ.11.33 కోట్లపై నిర్వహించిన సామాజిక తనిఖీలో రూ.29 వేలు రికవరీ, రూ.23 అపరాధం విధిస్తూ పీడీ శ్రీనివాస ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ రేపల్లెవాడ, చెరివి, ఆంబాకం, కాళమనాయుడుపేట, వానెల్లూరు, మదనంబేడు, కన్నావరం, ఎన్ఆర్ అగ్రహారం, ఇరుగుళం, ఆరూరు జడేరి ఫీల్డు అసిస్టెంట్లు పనితీరు మెరుగు పరుచుకోవాలని ఆదేశించారు. మదనంజేరి, శిరుణం బూదూరు పంచాయతీల ఫీల్డు అసిస్టెంట్లు పనితీరును పీడీ అభినందించారు. జిల్లా విజిలెన్స్ అధికారిణి భాగ్యలక్ష్మి, అంబుడ్స్‌మెన్ రాసారాయనాయుడు, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ కె.రవి, ఎస్ఆర్‌పీ అవులయ్య, ఏపీఓలు ప్రేమ్‌కుమార్, భాస్కరయ్య, కృష్ణయ్య, జేఈ ఇన్‌చార్జ్ సుమలత, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


నీట మునిగిన వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి భారతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలో నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని నీర్పాకోట, కనమనంబేడు గ్రామంలో దెబ్బతిన వరి పంటను వ్యవసాయాధికారిణి భారతి పరిశీలించారు. సుమారు 50 ఎకరాల్లోని వరిపంట నీట మునిగి పూర్తిగా దెబ్బతినిందని, కోత దశకు చేరుకున్న వరిపంట అకాల వర్షంతో నేలకొరిగిందని, చేతికి వచ్చే సమయంలో అకాల వర్షంతో తీవ్రంగా నష్ట పోయినట్లు రైతులు వివరించారు. ఆమె మాట్లాడుతూ జిల్లా అధికారులకు ప్రతిపాదనలు పంపుతానని తెలిపారు. రైతులకు పలు సలహాలు ఇచ్చారు.





శ్రీకాళహస్తి : ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరికి సన్మానం, సత్యవేడు : మాట్లాడుతున్న విజయలక్ష్మి, నాగలాపురం : ఎంఈఓ బాబయ్య,ఉపాధ్యాయులకు సన్మానం, బండారుపల్లెలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

నవ సమాజ నిర్మాతలు గురువులు

నారాయణవనం: విశ్వంలో విలువ కట్టలేనిది ఒక్క గురువు సేవలు మాత్రమేనని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్ రెడ్డితో కలసి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆదిమూలం మాట్లాడుతూ మార్గ దర్శకులుగా చదువు, సంస్కారాన్ని నేర్పే గురువులకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. ఉపాధ్యాయునిగా పనిచేసిన రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా ఎదిగి అందరి మన్ననలను పొందారని తెలిపారు. ఒక సాధారణ వ్యక్తి ప్రథమ పౌరుని స్థాయికి ఎదిగి, అత్యున్నత భారత రత్నను అందుకున్న రాధాకృష్ణన్ నేటి ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయుడని కొనియాడారు. వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు అత్యధిక ప్రాధానం ఇస్తున్నారని అన్నారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో మెరుగైన సౌకర్యాలతో విద్యను అందిస్తున్నారని తెలిపారు. ఉపాధ్యాయుడిగా, ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా నారాయణవనం వాసులకు ఎనలేని సేవలను అందించిన విశ్రాంతి హెచ్‌ఎం శివనాదాచ్చారిని శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అలాగే జిల్లా ఉత్తత సేవా పతకాన్ని పొందిన బాలుర ఉన్నత పాఠశాల పీడీ జయప్రకాష్‌తో పాటు మండల ఉపాధ్యాయులు గిరి, సరితను ఎమ్మెల్యే శాలువ కప్పి సన్మానించారు. ఎంపీడీవో గుణశేఖర్, ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


నారాయణవనం: విశ్రాంత హెచ్‌ఎం శివనాదాచ్చారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, ఎంఈఓలు

ఉత్తమ గురువులకు సత్కారం

శ్రీకాళహస్తి : పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరిని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఆర్కాడు శంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరు హైస్కూల్‌లో కూడా ఉపాధ్యాయుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఊరందూరులో విశ్రాంత ఉపాధ్యాయులు జనార్దన్ శర్మ, నాగరాజ కుమారి, రామిరెడ్డి, రాధాకృష్ణారెడ్డిని ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధాయురాలు రాజకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురువులే నవసమాజ నిర్మాతలు

సత్యవేడు: నవ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్రే కీలకమని, గురువుల స్థానం విశిష్టమైందని జెడ్పీటీసీ సభ్యురాలు పి.విజయలక్ష్మి అన్నారు. మంగళవారం సాయంత్రం ఎంపీడీఓ కార్యాయంలో ఎంఈఓ కె.రవి ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. విజయలక్ష్మి మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికే వన్నె తెచ్చిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదర్శనీయులని తెలిపారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎంఈఓ-1 కె.రవి, ఎంఈఓ-2 ఉషాను సన్మానించారు. పరుగుపందెం, చెస్, క్రికెట్, మ్యూజికల్ చైర్, లెమన్‌స్పూన్, షాట్‌పుట్ పోటీల్లో గెలుపొందిన ఉపాధ్యాయులకు బహుమతులు అందజేశారు. పుదుకుప్పం తమిళ పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

ఏర్పేడు: మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బండారుపల్లె జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం నిర్మల్ కుమార్‌తో పాటు 14 మంది ఉపాధ్యాయులను సర్పంచ్ జీవిత, వైస్ ఎంపీపీ తిరుపతి జనార్దన్‌రెడ్డి శాలువలతో సన్మానించారు. శ్రీకాళహస్తి ఎస్‌బీఐ మేనేజర్ పవన్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు సునీత, జయకుమార్, ఆనంద్, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, ద్వారకనాథ్‌రెడ్డి, ఉమామహేశ్వర్, సురేష్, రాధాకుమారి తదితరులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని ప్రధానోపాధ్యాయుడు రూపేష్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి హెచ్‌ఎం రూపేష్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులులేని సమాజాన్ని ఊహించలేమని తెలిపారు. ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందన్నారు.

గురువులకు ఆత్మీయ సన్మానం

శ్రీకాళహస్తి: అక్షరాలకు ఆకృతిగా నిలిచి వెలుగులు పంచే గురువులకు మంగళవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. పట్టణంలోని భేరివారి మండపంలో విశ్రాంత ఉపాధ్యాయులు పోలస్వామి స్వర్ణమూర్తి, సుధాకర్‌రెడ్డి, జనార్దన్ తదితరులను దుశ్శాలువాతో సన్మానించారు. వారికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. బీజేపీ నాయకులు గరికపాటి రమేష్ బాబు, సుబ్రహ్మణ్యంరెడ్డి, కోనేటి అయ్యప్ప, మధు వాసుయాదవ్, ఢిల్లీ కుమార్, సుబ్రహ్మణ్యం, కన్నా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా మంగళవారం మండలంలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓలు రవీంద్రనాథ్, ముని సుబ్రమణ్యం ఘనంగా సన్మానించారు. అదే విధంగా శ్రీనివాసతేజ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని కరస్పాండెంట్ కంద్రాతిసుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

పిచ్చాటూరులో ..

పిచ్చాటూరు: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఘనంగా సత్కరించారు. తహసీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన గురుపూజోత్సవంలో ఎంఈఓ బాబయ్య, 20మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అపరంజిరాజు, రైతు సంఘం అధ్యక్షుడు చిన్నదొరై, ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎంఎం సురేష్, ఎంపీపీ సిందూ శ్యామ్, ఎంపీడీఓ పద్మజ, వైస్‌ఎంపీపీ కుమారి ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గురువుల స్థానం ఉన్నతమైంది


వరదయ్యపాలెం : ఉపాధ్యాయులకు సత్కారం

వరదయ్యపాళెం: గురువుల స్థానం ఉన్నతమైందని లోకా ఫౌండేషన్ ప్రతినిధి రుద్ర దాసాజీ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా వరదయ్యపాళెంలోని ఒన్నెస్ కోచింగ్ సెంటర్‌లో లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గురువులను సన్మానించారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సత్కరించారు. లోకా ఫౌండేషన్ విద్యా విభాగం ఇన్‌చార్జ్ హరిగోపాల్ రెడ్డి, ఎంఈఓలు సరస్వతి, గున్నయ్య, ఫ్యాప్టో అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్ సుందర్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బత్తలవల్లం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి ఓడూరు ఉజ్వల్ రెడ్డి ఉపాధ్యాయులను సత్కరించారు.


శ్రీకాళహస్తి : ఊరందూరులో సన్మానం






పిచ్చాటూరు: సన్మాన గ్రహీత ఉపాధ్యాయులు, బీఎన్‌కండ్రిగ : సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు, శ్రీకాళహస్తి : ఉపాధ్యాయులకు సన్మానం , బీఎన్‌కండ్రిగ : సర్వేపల్లికి నివాళులు, సత్యవేడు : పుదుకుప్పం పాఠశాలలో మాట్లాడుతున్న హెచ్‌ఎం భారతి

సమష్టి కృషితో ఆదర్శంగా తొట్టంబేడు అభివృద్ధి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలాన్ని ఎమ్మెల్యే బియ్యపు మధుసూధన్‌రెడ్డి, ప్రజాప్రతినిధుల సహకారంతో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సురేష్ బాబు తెలిపారు. మంగళవారం తొట్టంబేడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ ఉన్నం నిర్మల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ మండల అభివృద్ధికి ఎమ్మెల్యే మధుసూదనరెడ్డి ఎంతో సహకరిస్తున్నారని, ఆయన సేవా గుణానికి కృతజ్ఞతలు తెలియచేశారు. మండలంలో నూతనంగా 120 పింఛన్లు మంజూరు చేశామన్నారు. మండల పరిధిలో ఆర్డీవో కార్యాలయం నిర్మించాలని ఎమ్మెల్యే నిర్ణయించడం అభినందనీయమన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో శిథిలావస్థకు చేరుకున్న అంగన్‌వాడీ భవనాల మరమ్మతులకు చర్యలు తీసుకోవాలన్నారు. మంజూరైన భవనాల నిర్మాణం ముందుకు సాగడం లేదన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సురేష్‌బాబు

అర్హులైన వారికి ఇంటిపట్టాలు

తహసీల్దారు సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మండలంలో రెండవ విడత ఇళ్లపట్టాల పంపిణీకి నెల్లిమాను కండ్రిగ సమీపంలో భూమి సేకరించామని తెలిపారు. తొమ్మిది గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. ఓటర్ల జాబితాను పక్కాగా రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. నీటి పారుదలశాఖ ఏఈ మునిమోహన్ మాట్లాడుతూ వాలగల మంద కాలువపై రూ.1.45కోట్లతో ఆనకట్ట నిర్మించనున్నట్లు తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ మండలంలో 5,300 ఎకరాలు ఈ-క్రాప్ నమోదు చేశామన్నారు. ఉపాధి ఏపీవో సుజాత మాట్లాడుతూ ఉపాధి కింద మామిడి, నేరేడు, జీడి మామిడి, బత్తాయి, సపోటా, కొబ్బరి, సీతాపలం, దానిమ్మ వంటి తోటల పెంపకానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ఇక వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. జెడ్పీటీసీ అర్చనా దేవి, వైఎస్ ఎంపీపీ మల్లిక, సింగిల్ విండో చైర్మన్ మణినాయుడు, సీడీపీవో శాంతిదుర్గ, ఎంఈవోలు భారతి, భాస్కర, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం





మంత్రి రోజా చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సుబ్రమణ్యంశర్మ, రమేష్

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు డాక్టర్ ఎస్.సుబ్రమణ్యం శర్మ గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. తిరుపతిలో మంత్రి రోజా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. డీఎస్సీ 200 2లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా వృత్తిని ప్రారంభించారు. 2009లో స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందారు. మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రిసోర్స్ పర్సన్‌గా, ప్రాథమిక స్థాయి గణితం, విజ్ఞానశాస్త్రం, బహుళ పాఠ్య పుస్తకాల రూపకల్పనలో ఒకరిగా పనిచేశారు. అవార్డు రావడం పట్ల పలువురు ఉపాధ్యాయులు అభినందనలు తెలియజేశారు.

కేవీబీపురం: మండలంలోని వడ్డికండ్రిగ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం మూర్తి రమేష్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించింది. తిరుపతి నిర్వహించిన గురుపూజోత్సవంలో మంత్రి ఆర్‌కే రోజా,జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

శ్రీకాళహస్తి: చెన్నై బైపాస్ రోడ్డులో ఎస్ఎస్ కల్యాణ మండపం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పురుషోత్తం (32) తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. జ్ఞానమ్మకండ్రిగ గ్రామానికి చెందిన పురుషోత్తం చెన్నై రోడ్డు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతూ ప్రమాదవశాత్తు గేదెను ఢీకొని కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో క్షతగాత్రుడిని 108 అంబులెన్స్‌లో శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చికిత్స పొందుతున్న పురుషోత్తం

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ

నారాయణవనం: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రమేష్ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.5 లక్షల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. జూలై 20వ తేదీ గురువారం ఉదయం మండలంలోని నైనారుకండ్రిగ ఎస్టీ కాలనికి చెందిన రమేష్ ఉపాధి హామీ పనుల కోసం వెలుతుండగా వెనుక వైపు నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. వైఎస్సార్ బీమా కింద ప్రభుత్వం రూ.5 లక్షలను మంజూరు చేసింది. మంగళవారం నారాయణవనంలో జరిగిన ఒక కార్యక్రమంలో మృతుని భార్య సుజాతకు ఎమ్మెల్యే చెక్కు ను అందజేశారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఎంపీడీవో గుణశేఖర్, సర్పంచ్ అమ్ములు, ఎంపీటీసీ సభ్యురాలు హారతి, బాలాజీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న వక్ఫ్ బోర్డు ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలని ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ముస్లిం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ పులి వి జ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరు ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వక్ఫ్‌బో ర్డు ఎన్నికల్లో పార్టీలకు తావు లేకుండా చూడాలని కోరారు. ముస్లిం ఐక్య వేదిక నేతలు నిజాముద్దీన్, అబ్బాస్ ఆలీ, సాదిక్, మొసినా బేగం, ముంతాజ్ బేగం పాల్గొన్నారు.

అధిక సంఖ్యలో కేసులు పరిష్కారం కావాలి

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో ఈనెల 9న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసుల పరిష్కారంపై తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి గురునాథ్ మంగళవారం సాయంత్రం న్యాయమూర్తి చాంబర్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమం తిరుపతి మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేటట్లు చూడాలని న్యాయమూర్తి పోలీస్ అధికారులకు సూచించారు. స్థానిక జూనియర్ సివిల్ జడ్జిలు పల్లపోలు కోటేశ్వరరావు, గ్రంధి శ్రీనివాస్, ఇతర న్యాయమూర్తులు, తిరుపతి అడిషనల్ ఎస్పీ వెంకట్రావు, రేణిగుంట డీఎస్పీ భవ్య, ఈస్ట్ డీఎస్పీ సురేందర్‌రెడ్డి, క్రైమ్ డీఎస్పీ కాటమరాజు, చంద్రగిరి డీఎస్పీ యశ్వంత్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చిల్లకూరు: మండలంలోని గుత్తవారిపాళెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం మన్నూరు గ్రామానికి చెందిన శశాంక్ ఎన్‌బీకేఆర్ కళాశాలలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఇంటి నుంచి బైక్‌పై కళాశాలకు వెళుతున్నాడు. గుత్తావారిపాళెం వద్ద కొండగుంటకు చెందిన శ్రీను బైక్‌పై వస్తూ ఇద్దరూ ఢీకొన్నారు. గాయపడిన ఇద్దరిని గూడూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి భరోసా



కౌలు రైతులకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నారాయణవనం: కౌలు రైతులకు కూడా పెట్టుబడి సాయం అందిస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి భరోసా కల్పిస్తున్నారని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. స్థానిక కమ్యూనిటీ భవనంలో మండలంలో రైతు భరోసా కింద లబ్ధిపొందిన కౌలు రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. మండలంలో 116 మంది కౌలురైతులకు ప్రభుత్వం విడుదల చేసిన రూ 8.70 లక్షల మెగా చెక్కును ఆయన అందజేశారు. ఆలయ మాట్లాడుతూ వ్యవసాయం దండగ అంటూ చంద్రబాబు రైతుల సంక్షేమ విస్మరించారని ఆరోపించారు. పాదయాత్రలో రైతుల కష్టాలను చూసి, అధికారంలోకి రాగానే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసి, గ్రామాల లోనే విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచారని అన్నారు.

పౌష్టికాహారం తప్పనిసరి

పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. స్త్రీ శక్తి భవన్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక ఆహార మాసోత్సవ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు, కిషోర బాలికలకు నాణ్యమైన పోషక ఆహార పదార్థాలు అందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు వేసిన రంగుల ముగ్గులు ఆకట్టుకున్నాయి. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఆహార సలహా మండలి మండల చైర్మన్ అన్నాదొరై, ఎంపీడీవో గుణశేఖర్, ఏవో శోభారాణి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, కౌలురైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధరిద్దాం.. ప్రాణాలను కాపాడుకుందాం


హెల్మెట్ ధారణపై అవగాహన ర్యాలీ

రేణిగుంట: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని సీతాఫల్ టెక్నాలజీస్ సీఈవో దుగసాని సతీష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మండలంలోని కేఎల్ఎం ఆస్పత్రి కూడలి వద్ద మంగళవారం సీతాఫల్ టెక్నాలజీస్ సిబ్బంది, గాజులమండ్యం సీఐ సుబ్బరాయుడు, ఎస్ఐ ధర్మారెడ్డి పోలీసు సిబ్బంది సంయుక్తంగా వాహనదారులకు అవగాహన ర్యాలీతోపాటు హెల్మెట్‌లను ఉచితంగా అందజేశారు. అటుగా కారులో వెళుతున్న వారిని ఆపి, వారికి రోజా పువ్వు ఇచ్చి సీటు బెల్ట్ ధరించాలని కోరారు. అలాగే ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్లను అందజేశారు. రేణిగుంట ఎయిర్‌పోర్ట్ మార్గంలోని ఈఎంసీ పరిధిలో ఉన్న సీతాఫల్ టెక్నాలజీస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ దుగసాని శశికుమార్, సీఈవో వేణు.వీర కటారి, హెచ్ఆర్ మేనేజర్ జీవితా కుంచె, జ్ఞానప్పరెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

నాయుడుపేటటౌన్: పట్టణంలోని కొత్త బీడీ కాలనీలో ఆత్మహత్యకు యత్నించిన మహిళ చెన్నై వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. ఎస్ఐ కృష్ణయ్య వివరాల మేరకు..బీడీ కాలనీకి చెందిన హనీఫ్‌తో చెన్నైకు చెందిన షేక్ రంజాని (30)తో పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. హనీఫ్ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలంగా హనీఫ్ ఆరోగ్యం సరిగ్గా లేకపోవడంతో జీవనం కష్టతరంగా మారింది. దీంతో రంజాని చెన్నైలో ఉన్న పుట్టింటికి వెళ్లిపోదామని భర్తను కోరింది. అందుకు భర్త నిరాకరించడంతో మనస్తాపం చెందిన రంజాని గత నెల 31వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం చెన్నైకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి హాఫీసా బేగం మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు చెన్నై వెళ్లి కుటుంబ సభ్యుల వాగ్మూలం తీసుకున్నారు.